# "ఏంచేస్తామో చూడు నిన్ను"

పమ్మి రామశాస్త్రి గారు

కష్టపరంపరలతో కృంగిపోయే హృదయసాగరంలో కసుగందుల తొక్కుపలుకు లొక్కొక్కప్పుడు ఆశావీచికలను బయలుదేరదీసి అంతులేని ఆనందాన్ని కలుగజేస్తూ ఉంటాయి. భోజనానంతరం రోజూ రాత్రి దొడ్లో బాదంచెట్టుక్రింద కూర్చుని చెంబులుతోముకుంటూ, తనకష్టాలను తలపుకు తెచ్చుకొని విచారిస్తూఉండే సుశీలకు ఒక్కొక్కప్పుడు బ్రహ్మానందమైపోయేది చంద్ర చెప్పేకబుర్లు వింటూవుంటే.

నాడు అమావాస్య. చీకటికాటుకమ్ముకు వచ్చింది. యథాప్రకారంగా భోజనాలైనతరువాత తనపని మీద దొడ్లోకి బయలుదేరుతూ "నాన్నా! చంద్రం నీవీమంచంమీద కూర్చోవేం! అమ్మ, నేనక్కడ బాదం చెట్టుక్రింద కూర్చుని చెంబులుతోముకుంటూ ఉంటాను." అంది మెల్లగా సుశీల.

"ఆ......ఆ......ఆ......ఏమో బాబూ; నేనుకూడా నీదగ్గరేకూర్చుంటాను బాదంచెట్టుదగ్గర" అన్నాడు చంద్రం.

"నాన్నా! నీవుబుద్ధిమంతుడవుకావూ, ఇంచక్కా రేపు మామయ్యవస్తాడు. మిఠాయి—బూడ్సులూ లాగూ—చొక్కా—గొడుగూ—అన్నీ తెస్తాడు. నీకియ్యద్దూ మరీ?"

"ఆ...... నేనూవస్తానూ............

"బెల్లంముక్క పెడతాను. తింటూకూర్చోవేం బాబూ, పోనీ."

"ఊ......ఊ......నాకేమీవద్దు......ఊ......ఊ..."

"చీకటిరా! బాబూ ఎల్లాచావను? గంపంతబలగముండీకూడా దిక్కుమాలిన పక్షినైపోయాను. ఎన్ని కబుర్లేనా పంపేను. ఎవరూవంగివాలరు. తొంగిచూడరు. ఒక్కతెనూ ఈచాకిరీచేసుకోలేకుండా ఉన్నానని జాలిపడేవారెవరు? ఉదయాస్తమానాలు ఈవిధంగా దొరుతోంటే మాటదక్కటంలేదు—చివాట్లూ చెప్పదెబ్బలూ—రామరామా, కాళ్లు లాక్కుపోతున్నాయి. నాకు మరణమేనా కలుగజేయడు ఆమాయదేముడు. పోనీపిల్లాణ్ణిఆడిస్తూ మాటాపలుకూ ఆడుతూ నాకుసహాయ్యంగాఉంటుంది సూరినిపంపించమని నాన్నకు ఎన్ని కబుర్లంపినా అజాపజాలేదు. దూరంగాఉన్నానని ఈవిధంగా మహోన్నతరసాలసాలశాఖాగ్రఫలంగా విడిచేశారు గాబోలు. పోనీ విడిచేయండి. ఈఫలం ఎప్పుడు రాలిపోతుందో, ఎప్పుడు వృక్షభారం తగ్గుతుందో అనేనేనూ ఆలోచిస్తూవున్నాను. ఈనలుసుపై ఇంకాకొంతఆశపెట్టుకొని మంచిదినాలు రాకపోతాయా అని వెనకముందు లాలోచిస్తున్నానుగాని, లేకపోతే ఈపాటికే అక్కడ మీభారాన్ని—ఇక్కడ వీరిభారాన్ని తగ్గించేదాన్ని"అని విలపిస్తూ, దుఃఖభారవివశరాలై దగ్గరగానున్నగోడకు తలవాన్చి అట్టే క్రుంగిపోయింది.

* * * *

తల్లి ఈవిధంగా దుఃఖముతో వీగిపోవడంచూచి "అమ్మా లే.........అమ్మా! లేవవే......"అన్నాడు చంద్రం ఏడుస్తూ. సుశీల తలపైకెత్తలేదు.

"అమ్మా! నాకు నిద్దరొస్తోంది—లేవలే. ఊ...ఊ..."అని చెయ్యిపట్టుకు లాగేడుచంద్రం.

అప్పుడు సుశీల తనకొంగుతో కళ్లుతుడుచుకొంటూ "రా, నాయినా...రా—పడుకోపెడతాను" అంటూ చంద్రాన్ని చేరదీసి ఎత్తుకొని, మంచంమీద పడుకోపెట్టి కొంతసేపక్కడ కూర్చొని, తిరిగి దొడ్లోకి వెళ్లాలని లేచింది. సుశీలలేచినవెంటనే "అమ్మా..."అనిపిలుస్తూ లేచికూర్చొని "నేనూవస్తాను"అని ఏడ్వడం మొదలుపెట్టేడు చంద్రం.

"అర్ధరాత్రయినా అపరరాత్రయినా నేను మేల్కోడం తప్పదు. నీకుకూడా ఎందుకుగా బాబూ ఈబాధ, సుఖంగాపడుకోక" అంటూవచ్చి మంచందగ్గర నిలబడింది సుశీల. "ఎత్తుకో...ఎత్తుకో..."అని రెండు చేతులుచాచి మంచంమీద నుంచున్నాడు చంద్రం.

"చీకటిరాత్రిళ్లురా బాబూ, పురుగూబుట్రావుంటుంది. ఇందాకా అన్నంతింటూవుంటే పాముని చంపేను. నీవుచూశావుగా, చెప్పినమాట వినవు."

"ఆ......ఆ......ఆ......"

"సరే—రా—అన్నిటికీ దైవమే ఉన్నాడు"అని ఎత్తుకొని దొడ్లోకితీసుకొనివెళ్లి దగ్గర కూర్చో బెట్టుకుంది.

* * * *

"అమ్మా! నాకు మామయ్య కొత్తలాగూ—చొక్కా—బూడ్సులూ—బుల్లిగొడుగూ, తెస్తాడన్నావు. ఎప్పుడొస్తాడే?" అన్నాడు చంద్రం.

"రేపువస్తాడు." అంది సుశీల.

"మామయ్య దేవూరే అమ్మా?"

"ఏలూరు"

"ఉహూ...ఏలూరా?..."

"ఐతే మామయ్యంటే ఎవరే అమ్మా."

"మామయ్యంటేనా, మాఅన్నయ్య."

"ఊహూ, మీ అన్నయ్యా."

"మరి పిన్నంటేనో..."

"పిన్నంటే ఇంకోఅమ్మ"

"ఆ...ఉత్తదీ...అబద్ధంచెప్పేవు. రామానికీ, వెంకటానికీ, వాళ్లకీ ఇంకోఅమ్మ లేదేంమరీ."

"వాళ్లకు ఇంకోఅమ్మ లేదులే."

"పిన్ని దేవూరే అమ్మా"

"పిన్ని దేవూరో నాకు తెలియదురా నాన్నా!"

"పోనీలేగాని పిన్ని మనింటికీ వేళ భోజనానికి రాలేదేం" అన్నాడు చంద్రం ఆవలిస్తూ.

"పిన్నికి నామీదకోపంవచ్చింది." అంది సుశీల.

"ఎందుకూ, కోపం"

"నేనుపొద్దున్నే వేడిబువ్వ ఒండిపెట్టలేదని."

"మరిరోజూ పొద్దున్నే నాకూ, నాన్నకూ, పిన్నికీ వేడిబువ్వ ఒండిపెడుతున్నావుగా."

"ఈవేళా వేడిబువ్వవండేను—అది కొంచెం చల్లారిపోయిందనీ."

"పోనీ వేడిబువ్వ పిన్నే వండుకోకూడదూ, రోజూ"

"ఓరివెర్రినాన్నా, మీపిన్నిని అన్నం ఒండుకోనిస్తారురా మీనాన్న? అన్నం ఒండితే మీపిన్ని అలసిపోదూ?"

"మరినీవు అలసిపోవూ?"

"నాకు అలసిపోవడం రోగంఏమిటి?"

"ఆ...నిజంగా చెప్పవే అమ్మా, నీవు అలసిపోవూ?"

"అలసిపోలేమాత్రం తప్పతుందా, నాయనా!"

"ఎప్పుడూ నీవేపంపడం ఎందుకు? అంతఅలవడం ఎందుకు? పిన్నికూడా ఒందకూడదూ పోనీ?"

"పిన్నిఒండితే మనంతినోచ్చా? మనం బ్రాహ్మలంకాదూ"

"పిన్ని బ్రాహ్మలు కారేమిటే? అమ్మా!"

"కాదు. కాదు."

"ఊహూ...అన్నంవండకపోతే పోనీ, ఇంట్లో ఇంకేంపనులూ చేయకూడదటే, ఎప్పుడూ నాన్నతో మాట్లాడుతూ మేడమీద కూర్చోకపోతే."

"అయ్యో, కొంపమునుగుతుంది పిన్ని కివినిపిస్తే; గట్టిగామాట్లాడకురా బాబూ!" అంది సుశీల మెల్లగా.

"వింటే ఏంచేస్తుందీ?"

"ఏంచేస్తుందా, మొన్నచూశావుగా. అల్లాగే మీనాన్న గారిచేత కొట్టిస్తుంది."

"పిన్ని మంచిదికాదే అమ్మా...నన్నూ అల్లాగే కొట్టించిందిగా ఆవేళ."

"అమ్మా! నిన్నూనన్నూ ఎప్పుడూనాన్న చేత కొట్టించే పిన్ని మనఇంట్లో ఎందుకు? అవతలకు గెంటేస్తేం?"

చంద్రం అన్నమాటలు సుశీల హృదయంలో గొప్పపరివర్తనం కలుగచేసి, నూతోత్సాహం ఆమె ముఖంలో వ్యక్తంచేశాయి. వెంటనే చంద్రాన్ని దగ్గరకులాక్కొని "వెఱ్ఱినాన్నా!" అంటూ ముద్దుపెట్టుకొని "గట్టిగా మాట్లాడకురా బాబూ; ఏదోతంటా తెస్తావు" అంది సుశీల.

చంద్రం ఒళ్లువిరుచుకొని ఆవలిస్తూ "ఇంకెంతసేపే ఇక్కడకూర్చోడం. అబ్బా, నాకునిద్రొస్తోంది. చప్పునరావే బబ్బుందాం" అన్నాడు.

"ఏపోయిందమ్మా, నడు, వెళ్లి బబ్బుందాం" అంది సుశీల.

*　　*　　*　　*

తెల్లవారింది 6¼ గంటల రైలుదిగినజనం తండోపతండాలుగా వస్తూన్నారు. రైలుస్టేషనుంచి "అదిగో రైలుదగ్గరనుంచి వచ్చేబళ్లచప్పుడు" అంటూచంద్రం గబగబావీధిలోకి పరుగెత్తుకువచ్చేడు.

"అమ్మో, రామారావుమామయ్యవస్తున్నాడే" అని కేకవేస్తూ వెంటనే సుశీలవద్దకు పరుగెత్తుకువెళ్లేడు చంద్రం.

రామారావువస్తున్నాడని వినగానే సుశీలముఖకమలం వికసించింది. "నిజంగా చెప్పరా, చంద్రం! మామయ్యవస్తున్నాడా" అంటూ త్వరగా పొయ్యిమీదనున్న యిడ్డెనుపాత్రదింపేసి, పాలగిన్ని పొయ్యిమీద పెట్టి వీధిలోకివచ్చి నుంచుంది. రామారావు ప్రత్యక్షమయ్యాడు. సుశీల కనుకొలకులనుండి నీటిబిందువులు బొటబొటరాలేయి. "బ్రతికివున్నానని ఇప్పటికేనాజ్ఞాపకంవచ్చింది. చాలాబాగావుందిరా, అన్నయ్యా," అంది సుశీల.

"ఏమోనే, ఎప్పటికప్పుడే అల్లాఅవుతోంది, సావకాశంలేక," అంటూ ఇంట్లోకి వెళ్లేడు.

"అమ్మకు, జ్వరంవచ్చిందనివిన్నా ఈమధ్య; నెమ్మదిగావుందా"

"ఆ...ఆ...నెమ్మదిగానే వుంది."

"చెల్లెలును అత్తవారింటిదగ్గరనుంచి తీసుకొచ్చేరుటే."

"ఔనుఔను పదిహేనురోజులైంది."

"పోనీ దాన్నేనా తీసుకెళ్లేరు బాగానేవుంది."

1040

"నీమీదేమైనా కోపమటే, వెఱ్ఱిదానా" అంటూఇంకా ఏదోమాట్లాడబోతోంటే, తివఙ్ల్లోకూర్చొన్న చంద్రం "నాకొత్తచొక్కా ఏదీ—నాబూడ్చులేవీ—"అంటూఒకటే ధోరణిగా అడుగుతూ, మాటతొణగకుండా చేశాడు.

"ఆ... తెచ్చాను. పెట్లోఉన్నాయి తీసిస్తాను ఆగు"అన్నాడు రామారావు.

"ఊ...చప్పునతీసియ్యి..."

"ఇదిగో తీసిఇస్తున్నా"

పెట్లోనుంచి రామారావు చొక్కా, లాగూ తీస్తున్నాడు. అక్కడనేనిలబడిఉన్న సుశీల "అయ్యో, పొయ్యిమీద పాలు పెట్టివచ్చా పొంగిపోతున్నాయో ఏమో చూచివస్తా"అంటూ చప్పునవరుగెత్తిందిలోపలికి.

"మామయ్యకూ, నాకూ కాఫీ చప్పునపట్రాఅమ్మా"అని కేకేశాడు చంద్రం.

"ఆ...ఆ...అంది" సుశీల.

* * * *

"మామయ్యా, అదిగో ఆఏడ్పువినిపిస్తోందా? నాన్నకొడుతున్నాడు అమ్మని, కాఫీకాయడం ఇంత ఆలస్యమైందేమని కేకలేస్తున్నాడు చూశావా?"

"అరరే, నాతోమాట్లాడుతూ ఉండడంచేత కొంచెంఆలస్యమైతే కావచ్చు. ఈమాత్రానికేకొట్టాలా" అనుకొనుచూ లోపలికివెళ్లేడు రామారావు.

సుశీల కండ్లనీరుగ్రుక్కుకొంటూ మాట్లాడకుండా నిలబడివుంది. చంద్రం భయపడి సుశీలనుపట్టుకొని నిలబడ్డాడు.

"ఏం—మాట్లాడవేం—ఇంతఆలస్యం ఎందుకు కావాలి—అని కేకలువేయుచు, సుశీలభర్త కఠినంగా శిక్షిస్తూవుంటే, భయపడి గజగజలాడుతూ "ఈమాటుకొట్టు,మాఅమ్మని—నేనూ మామయ్యా నిన్నించే..." అంటూ బ్యారుమని ఏడ్చేడు చంద్రం.

# పార్వతి నిర్యాణము

శ్రీ మంతికిల్పాల పార్వతీదేవిగారు

మానవజన్మనుంట యవమానమటంచుఁ దలంచినావొ, గం
గానదితోటిసామ్యమును గారవమొప్పగఁబొందఁగోరితో
మేనకసేమ మీవరయ మేదినిబాసియునేగినావొ, మా
మానససీమలందుఁ జెనుమంటనుగూర్చితివింక పార్వతీ!

పతిమెదైవంబటంచును మతిదలంచి
అత్తమామలయాజ్ఞల కనుగుణమయి
తోటికోడండ్ర మాటలతోడనడచి
పుట్టుమెట్టుగృహాలకుఁ బుణ్యమిచ్చి
బంధుగులమధ్య బ్రతుకంగభారమనుచు
సురిగిపోయితివేమొకో సుదతి! నీవు
సంఘమునఁబిశాచంబుగాసంచరించు
ఘోషశిష్టమె నిన్నిట్లుకూల్చెనేమొ.

నీవులేనట్టి మాసద్మనిష్ఫలంబ
యిన వనముపోల్కి నున్నదోవనజనేత్ర!
మాదునిర్భాగ్యమే నీదుమరణమునకుఁ
గారణంబయ్యె నింకనేకరణిసైతు.
ఐహికసుఖేచ్ఛ యస్థిరమంచుఁదనదు
బంధుగులవీడి పరలోకమొందినట్టి
భాగ్యవతియునై పరగుమాపార్వతికిని
నాత్మశాంతిని జేకూర్చుమా ఉమా!

1041